
# పోతనభాగవతంలో రసగుళికలు

## – ఆర్.శర్మ దంతుర్తి



## 88 వ భాగం

### వృత్రాసుర వృత్తాంతం – 12, ఇంద్రుడి బ్రహ్మహత్యా పాపం

యుద్ధం చేస్తుంటే ఇంద్రుడి చేతిలో వజ్రాయుధం కింద పడిపోయింది. వృత్రుడు నిరాయుధుడైన ఇంద్రుణ్ణి చంపకుండా మరోసారి అయుధం తీసుకోమని చెప్పాడనీ అధర్మంగా తాను యుద్ధం చేయననీ చెప్పాడనీ క్రితం వ్యాసంలో చూసాం. కిందపడిన వజ్రం అందుకుని అధ్యాత్మ భావాలు ఉన్న వృత్రుడి సంభాషణ విన్నాక, దాన్ని అతని మీద ప్రయోగించే ముందు, ఆశ్చర్యపోయి అడుగుతున్నాడు

ఉ. ఏ నియమంబు సల్పితివొ? యెట్టి మహాతప మాచరించితో
పూని రజోగుణాభిరతిఁ బొందిన నీ మతి శాంతి దాంతి స
మ్మానస మానసానుభవ మత్తమరాళుఁ డరోష భావ స
మ్మానుఁ డమేయుఁ డా దనుజమర్దను భక్తి పొసంగె నెంతయున్. [6-423]

నువ్వు రాక్షసుడివే, ఎటువంటి మహా తపస్సు చేసావో, ఏమేమి నియమాలు ఆచరించావో కానీ నీ మనసు దనుజమర్దనుడు – రాక్షసులని అణగదొక్కే జగన్నాధుడి మీద లగ్నం అయింది ఈ చివరి క్షణాలలో. ఇదెంతా ఎలా సాధ్యం? ఇలా మాట్లాడుతున్న ఇంద్రుణ్ణి, ఐరావతంతో సహా గుటుక్కున మింగేశాడు వృత్రాసుడు.

ఉ. కందఁడు భీతి గుందఁడు ప్రకంపనమొందఁడు పెద్దనిద్దురం
జెందఁడు తత్తఱింపఁడు విశేషముఁ జొప్పఁడు వైష్ణవీ జయా
నందపరైక విద్యను మనంబునఁ దాల్చుచు నుండెఁ గాని సం
క్రందనుఁడా నిశాచరుని గర్భములో హరిరక్షితాంగుఁడై. [6-429]

అలా వృత్రాసురుడి కడుపులో పడ్డ ఇంద్రుడు భయపడలేదు. చేతిలో వజ్రాయుధం, మనసులో నారాయణ కవచం ఉన్నాయి కనక యోగబలంతో వృత్రాసురిడి ఉదరం భేదించి బయటకి వచ్చాడు.

ఆ. ఏమి చెప్ప నప్పు డింద్రారి తనువున
నొక్క దివ్యతేజ ముబ్బి వెడలి
లోకమెల్లఁ జూడ లోకులు చూడని
లోక మరసి విష్ణులోను చొచ్చె. [6-432]

ఇప్పుడు శుకమహర్షి పరీక్షిత్తుతో చెప్తున్నాడు యుద్ధం అవగానే ఏమైందో. ఇలా వృత్రాసురుడి ప్రాణం పోగానే అతని శరీరంలోంచి ఓ దివ్యతేజస్సు వచ్చి లోకం అంతా చూస్తూండగా లోకులు చూడని లోకానికి, వైకుంఠానికి వెళ్ళి, భగవంతుడిలో లీనమైంది. ఇదే విధంగా మనం మహాభారతంలో శిశుపాలుడు చావగానే అతని శరీరంలోంచి వచ్చిన తేజస్సు కృష్ణుడిలో కలవడం చూడవచ్చు. యుద్ధం సమయంలో వృత్రుడు చెప్పిన వేదాంతం, ఆయన పోయాక తేజస్సు భగవంతుడిలో లీనమవడం చూస్తే ఈ వృత్రాసురుడి పూర్వజన్మ(ల)లో శిశుపాలుడిలాగే అత్యంత విష్ణుభక్తుడని అర్ధమౌతోంది కదా?

వ. ఇట్లు లోకభీకరుండై వృత్రాసురుండు గూలిన, నఖిల లోకంబులు బరితాపంబు లుడిగి సుస్థితిం బొందె; దేవర్షి పితృగణంబులు దానవుల తోడంగూడి, యింద్రునకు జెప్పక తమతమ స్థానంబులకుం జనిరి;" అనిన విని, పరీక్షిన్నరేంద్రుండు శుకయోగీంద్రున కిట్లనియె.
[6-433]

ఆ. ఏమి కారణమున నింద్రుతోఁ బలుకక
సురలు పోయి? రట్టి సురగణంబు
లెందుచేత సుఖముఁ జెందిరి? వజ్రికిఁ
జేటు గలుగు టెట్లు? చెప్పవయ్య! [6-434]

ఇలా వృత్రాసురుడి నేలకూలగానే ప్రపంచం బాగుపడింది. అయితే దేవర్షి, పితృ గణాలు, మిగతా దేవతలందరూ కూడా ఇంద్రుడితో మరో మాట మాట్లాడకుండా ఎవరి స్థానాలకి వాళ్ళు వెళ్ళారు. ఈ కధ విన్నాక ఇలా ఇంద్రుణ్ణి మిగతా అందరూ వెలివేయడానిక్కారణం ఏమిటో పరీక్షిత్తు అడుగుతున్నాడు శుకయోగిని.

వ. అనిన శుకుం డిట్లనియె "వృత్రపరాక్రమ చకితులయిన నిఖిల దేవతలును, మహర్షి గణంబులును, మున్ను వృత్రవధార్థం బింద్రునిం బ్రార్థించిన నతండు బ్రహ్మహత్యకుం జాలక, "తొల్లి విశ్వరూపునిం జంపిన పాపంబు స్త్రీలయందును, భూమియందును, జలంబులందును, ద్రుమంబులందును విభజించి పెట్టితిని; ఇప్పు డీ హత్య యేరీతిం బాపుకొనువాఁడ? నా కశక్యం" బనిన మహర్షు "లశ్వమేధ యజ్ఞంబు చేయించి, యజ్ఞపురుషుం డైన శ్రీ నారాయణదేవుని సంతుష్టునిం జేసి యీ హత్యం బాపంగలవారము; స్వభావంబున బ్రాహ్మణ పితృ గో మాతృ సజ్జన హంతలైనవార లే దేవునిం గీర్తించి శుద్ధాత్ము లగుదు; రద్దేవుని నశ్వమేధ మహామఖంబున శ్రద్ధాన్వితుండవై సేవించిన నీకు ఖలుండైన యిద్దురాత్ముని హింసించిన హత్య యేమి చేయంగల?" దని యొడంబఱిచిన, నింద్రుండు వల్లె యని యివ్విధంబున మార్తునిం బరిమార్చి, బ్రహ్మహత్యం బొంది, యత్తాపంబు భరియింప నోపక దుర్దశం బొందె; అప్పుడు. [6-435]

వృత్రాసురుడి పరాక్రమం చూసిన దేవతలు ఇంద్రుణ్ణి వజ్రాయుధం కోసం విష్ణువు దగ్గిరకి తీసుకెళ్తుంటే ముందు ఆయన అడిగాడు. “ఇంతకు ముందే విశ్వరూపుణ్ణి చంపినందుకు బ్రహ్మహత్యా పాపం చుట్టుకుంది. దాన్ని మిగతావాళ్లతో పంచుకున్నాను. ఇప్పుడు వృత్రాసురుణ్ణి చంపితే మరోసారి అది తగులుకుంటే ఎలా?” దానికి వాళ్ళేమన్నారంటే, “ఓ సారి వృత్రుడు పోయాక నీచేత అశ్వమేధం చేయిస్తాం. ఎటువంటి పాపం చేసినా భగవంతుణ్ణి ఆశ్రయిస్తే అది పోగొట్టుకోవచ్చు. అదీగాక వృత్రాసురుడు రాక్షసుడు. వాణ్ణి చంపినందుకు, అశ్వమేధం చేయించి నారాయణుణ్ణి ఆశ్రయిస్తే ఈ బ్రహ్మహత్యాపాపం నిన్నేమీ చేయలేదు.” అలా ఇంద్రుడు ఒప్పుకుని వృత్రాసురుణ్ణి సంహరించాడు. ఓ సారి వాడు చావగానే మరోసారి బ్రహ్మహత్యా పాపం అటుకుంది. ఈయనకి అంటుకున్న పాపం చూసి మిగతావాళ్ళు పక్కకి తప్పుకున్నారు ఏమీ మాట్లాడకుండా. ముందునుంచీ చెప్తునట్టూ ఎవరి పాప పుణ్యాలు వారివి, ఎవరు ఎలాంటి హామీలు/సలహాలు ఇచ్చినా ఇవ్వకపోయినా, మనం చేసే పాపపుణ్యాలు మన వెంట తరుముతూనే ఉంటాయి. కూడా ఎవరైనా వస్తారా, రారా అనేది వేరే విషయం.

సీ. పాపంబుఁ జండాలరూపంబు గలదాని;
ముదిమిచే నొడలెల్ల గదలుదాని
క్షయకుష్ఠరోగ సంచయకృతం బగుదాని;
నురురక్తపూరంబు దొరఁగుదాని
నరసిన వెండ్రుకల్ నెరసిన తలదాని;
నటఁ బోకుపో కుండు మనెడుదానిఁ
గదరు కంపునఁ బ్రేవు లద రఁజేసెడుదానిఁ;
దా నెందుఁ బాటిన దఱుముదాని [6-436]

ఆ. "నా గుణంబు లెల్ల భోగింప కేరీతి
నరుగ నెంతవాఁడ" వనెడుదాని
బిట్టు దిరిగి చూచి భీతిల్లి సిగ్గుతో
దేవనాయకుండు దెరలి పఱచె. [6-436.1]

ఇలా ఆ పాపం ఛండాల రూపంలో తరుముతూ ఉంటే ఇంద్రుడు పరుగు పెట్టడం మొదలుపెట్టాడు. ‘నా గుణాలు అనుభవించకుండా ఎక్కడకి పోతావు?’ అంటూ ఆ పాపం అనేక రోగాలతో, కంపుతో ఇంద్రుణ్ణి తరమడం మొదలుపెట్టింది. దాన్ని చూసి సిగ్గుతో మరింత కుంగుతూ ఇంద్రుడు పరుగెత్తాడు. దేవతలు అశ్వమేధం చేయించడం తర్వాత సంగతి ముందు ఈ పాపం తప్పించుకోవడం ఎలా?

వ. ఇట్లతి వికృతత్వంబుతో బ్రహ్మహత్య వెనుతగుల నింద్రుండు నభోభాగ భూభాగ దిగ్భాగంబు లెల్లం దిరిగి, చొరం దెరువులేక దీర్ఘ నిర్ఘాతాటోప నిశ్వాస దూషితుండై, యీశాన్య భాగంబునకుం బఱచె; యద్దెస నమేయపుణ్యగణ్యంబైన మానస సరస్సునం బ్రవేశించి, యం

దొక్క కమలనాళంబు చొచ్చి తంతువులం గలసి రూపంబు లేక యలబ్ధభోగుం డై, బ్రహ్మహత్యా విమోచనంబుఁ జింతించికొనుచు, సహస్ర వర్షంబు లుండె నా చండాలియు నది పరమేశ్వర దిగ్భాగం బగుటం జేసి, యందు జొరరాక కాచియుండె, నంతకాలంబుఁ ద్రిదివంబున నహుషుండు విద్యాబల తపోబల యోగబలంబులం బాలించుచుండి, సంప దైశ్వర్య మదాంధుండై, యింద్ర పత్నిం గోరి, యింద్రుండు వచ్చునందాక నాకుం బత్నివి గమ్మనిన, నా శచీదేవి బృహస్పతి ప్రేరితయై, బ్రహ్మర్షి వాహ్యశిబిక నెక్కి వచ్చి, నన్ను భోగింపు మనిన నతం డట్ల చేసి, కుంభ సంభవ శాపహతుండై, యజగర యోనియందుఁ బుట్టె; అంత నింద్రుండు బ్రహ్మర్షి గణోపహూతుండై, త్రిదివంబునకు వచ్చె, నంత కాలంబు నారాయణ చరణారవింద ధ్యానపరుండై యుండుటం జేసియు, దిశాధినాథుం డైన శంకరుచేత రక్షింపఁబడ్డవాఁడై యుండుటం జేసియు, దద్దోష బలంబు దఱఁగి సహస్రాక్షుం బీడింప లే దయ్యె; అప్పు డింద్రుండు నిజైశ్వర్యంబునుం బొంది బ్రహ్మర్షి పరివృతుండై, మహాపురుషారాధనంబు చేసి, హయమేధా ధ్వరంబునకు దీక్షఁ గైకొని, బ్రహ్మవాదులచేత నాదరింపఁ బడుచున్న వాఁడై, సర్వదేవతామయుండైన నారాయణుం బరితృప్తుం జేసి, మంచు విరయించు మార్తాండుని చందంబునఁ ద్వాష్ట్రవధరూప పాపంబు నాశంబు నొందించి, సకల దివిజ యక్ష గంధర్వ సిద్ధ మునిజన సంస్తూయ మానుండయి, త్రిభువనైశ్వర్య భోగభాగ్యంబులం గైకొనియె; అప్పుడు.

[6-437]

అలా వికృతమైన ఆకారంతో తరిమే బ్రహ్మ హత్యని తప్పించుకోవడానికి ఇంద్రుడు తిరగని ప్రదేశం లేదు. (నభోభాగ, భూభాగ, దిగ్భాగంబులెల్ల). చివరకి ఈశాన్యంలో పరమేశ్వరుడు ఉండే చోట మానస సరోవరంలో ఓ పద్మంలో ప్రవేశించి దాని తూడులో దాక్కున్నాడు. ఎంతకాలం? వేయి సంవత్సరాలు. అక్కడకీ ఈ బ్రహ్మ హత్య ఇంద్రుణ్ణి ఆవహిద్దామని ప్రయత్నం చేసింది కానీ, ఆ స్థలం ఎవరిది? పరమేశ్వరుడు ఉండేది, అందువల్ల బయటే ఇంద్రుడికోసం చూస్తూ కూర్చుంది లోపలకి వెళ్ళలేక. అలా ఇంద్రుడు ఆ తామరతూడులో నారాయణ మంత్రం జపిస్తూ ఉండడం వల్ల నహుషుడు ఇంద్రపదవి అధిరోహించాడు. అలా ఇంద్రపదవిలోకి వచ్చిన నహుషుడి కథ మరోలా ఉంది. ఆయన శచీదేవిని చూసి మోహించాడు. అందువల్ల శపించబడి ఇంద్రపదవి పోగొట్టుకుని అజగరం (కొండ చిలువ) గా పుట్టాడు. ఇదంతా జరగడానికి వేయి వేయి సంవత్సరాలు అయింది.

అన్ని సంవత్సరాల్లోనూ తామరతూడులో కూర్చుని నారాయణ జపం (మహాపురుషారాధనం) చేసాడు. అప్పటికి ఈ మంత్ర ప్రభావం వల్ల బ్రహ్మ హత్యా పాపం నీరసించింది. రామనామంతో వాల్మీకి మహర్షి అయినట్టే ఇంద్రుడికి పాపం నీరసించింది. దీనికి కారణం ఏమంటే ఈ యజ్ఞం అయితే భగవంతుడో ఆ యజ్ఞం నిరంతరంగా చేసారు వీళ్ళిద్దరూ. అదే కృష్ణుడు చెప్పిన "యజ్ఞానాం జప యజ్ఞోస్మి (భ. గీ 10.25)." మరో విషయం ఏమంటే బ్రహ్మ హత్యా పాపం నీరసించింది కానీ పూర్తిగా పోలేదు. ఆ మిగిలినది కూడా పోగొట్టుకోవడానికి ఈ సారి అశ్వమేధం చేయించారు దేవతలు ఇంద్రుడితో. అలా ఆ పాపం పూర్తిగా పోగొట్టుకున్నాడు. ఇదంతా నారాయణ కవచ మహాత్యం అని శుకుడు చెప్తున్నాడు పరీక్షిత్తుకి భాగవత కథలో భాగంగా.

గమనించారా? వృత్రాసురుడిని చంపినందుకు ఇంద్రుడిచేత అశ్వమేధం చేయిస్తాం అని చెప్పినా అతనికి బ్రహ్మహత్యా పాపం చుట్టుకునేసరికి దేవతలు ఎవరి దారి వారు చూసుకున్నారు. మరో విషయం ఏమంటే, తన దగ్గిరకి వచ్చిన దేవతలకి ధధీచి అస్థికలు అడగమని చెప్పేముందు విష్ణువు ఏమన్నాడు? "... బ్రీతుండనైన నాయందు భక్తులకుం బొందరాని యర్థంబు లేదు, విశేషించి నాయందునేకాంతమతి

యైన తత్త్వవిదుం డన్యంబులం గోరకుండు; గుణంబుల యందుఁ దత్త్వజ్ఞానగోచరుం డైన వాఁడు విషయనివృత్తచిత్తుండై సంసార మార్గంబు నిచ్ఛింపడు."

నాయందు ఏకాంతమతి అయినవాడు ఇవ్వన్నీ కోరడు. భగవంతుడే కావాలనుకుని తపస్సు చేయాలి కానీ మిగతా వాటికోసం చేయకూడదు అని నిగూఢంగా చెప్తున్నాడు. ఇదే బుద్ధుడు చెప్పేది కూడా. కోరికలే దుఃఖానికి కారణం. వివేకానందులు ఇదే చెప్తారు కూడా, "దేనినీ కోరవద్దు. భగవంతుణ్ణి కూడా కోరవద్దు. ఆయనమీదే దృష్టి పెట్టి పనులన్నీ చేస్తూ ఉండండి; అన్నీ అవే సర్దుకుంటాయి." ఇదే భగవద్గీతలో చెప్పే కర్మ సన్యాసం కూడా.  చేతిలో ఉన్న పని అత్యంత ముఖ్యం అన్నట్టూ, అత్యంత ఇష్టంగా చేయండి. ఆ పని చేస్తే/చేసాక దాని వల్ల నాకేం వచ్చింది/వస్తుంది అనే ఆలోచనే వదుల్చుకోవాలి. అలా చేసినప్పుడు మనం చేసే కర్మ వల్ల వచ్చే ఫలితం మనకి అంటుకోదు.

ఇప్పుడు మనకి ఇంకా వదలని సందేహం ఏమిటంటే ఈ కథలో, అసలు వృత్రాసురుడికి ఈ అధ్యాత్మ భావాలు ఎలా కలిగాయి, అతను పోయాక శరీరంలోంచి తేజస్సు విష్ణువులో కల్సింది అంటే పూర్వ జన్మలో కూడా అతి క్రూరుడైన రాక్షసుడా అనేవి. వీటికి సమాధానం ముందు వ్యాసాల్లో తెలుస్తుంది.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS